ఉదయం దీపావళి కథల పోటీలో రు. 1500
ద్వితీయ బహుమతి పొందిన ఉత్తమ కథ!

# నీడల ముడులు

మనుషుల మధ్య డబ్బుతో
కలుషితం కాని సంబంధాలు ఉన్నాయా?
అన్నదమ్ముల మధ్య, భార్యా భర్తల మధ్య,
స్నేహితుల మధ్య ఏర్పడే డబ్బు




స్వాతి

సంబంధాల్లో అపార్థాలూ, పేచీలూ సన్న సన్నగా రాజుకుంటూనే ఉంటాయి. సమాజంలోని అపరిచితుల మధ్య కూడా అంతే!

''ఏయ్ రిక్షా! నీలం థియేటర్‌కి వస్తావా? ఏమివ్వాలి?" అని అడుగుతుంది ఒక మనిషి బరువు.

" అయిదు రూపాయలు సార్," జవాబిస్తుంది రిక్షా! "పది రూపాయలు వద్దా?" ఆ గొంతులో వ్యంగ్యం పలుకుతుంది.

" చివరి క్లాసులో కూర్చుని చూసినా అదే బొమ్మ, పైక్లాస్‌లో కూర్చుని చూసినా అదే బొమ్మ. పై క్లాస్ టిక్కెట్టు కోసం మూడు రూపాయలు దుబారా ఖర్చు చేస్తారుగాని బరువులాగే రిక్షా వానికి ఒక్క రూపాయి ఎక్కువ ఇవ్వాలంటే ఏడ్చిచస్తారు. ఈ డబ్బున్న నా కొడుకులు అందరూ అంతే!" అంటూ రిక్షా గొణుక్కుంటుంది.

కొంచెం సేపు తరువాత ఇద్దరి మధ్యా ఒక ఒప్పందం రూపుదాలుస్తుంది. ఆ సమయానికి ఇద్దరిలో ఎవరిది ఎక్కువ అవసరమో వాళ్లు దోచుకోబడతారు. (అక్కడికీ— నువ్వు రాకపోతేనేం, నడిచైనా పోగలను అన్న ధీమాని శరీరం బరువూ, నువ్వు నా రిక్షా ఎక్కకపోతే మానిపో! నేనేమీ పస్తులతో చచ్చిపోను. ఇంట్లో రెండు రూపాయల బియ్యం ఇరవై కేజీలు మూల్గుతున్నాయి అన్న నిర్లక్ష్యాన్ని రిక్షానూ, తమ దొంగ లౌక్యాల్లో భాగంగా ప్రదర్శించే ఉంటారు)

బేరం కుదిరిన్పుటికీ వాడ్ని వీడో వీన్ని వాడో తిట్టుకుంటూనే ఉంటారు. దారి పొడవునా రెండు సంఘ జీవుల మధ్య కర్కశమైన సర్దుబాటు! అమ్మేవానికీ కొనేవానికీ మధ్య ఉండేది— మనుషుల మధ్య సంబంధం కాదు, వస్తువుల మధ్య సంబంధమే!

ఇది కూడా అంత ఆశ్చర్యపర్చే విషయం కాదుగానీ, ఈ జడత్వపు సంబంధానికి రక్త సంబంధపు ప్రేమ కూడా అతీతం కాదు అన్న విషయమే నాకు చాలా ఆలస్యంగా తెలిసొచ్చి ఆశ్చర్యపర్చింది

తల్లి అనగానే ఆ పదం చుట్టూ ఏదో ఒక ఔన్నత్యపు భావం కలుగుతుంది నాకు.

"మా అమ్మ పొద్దున్నే లేచి, పాచికసువులు నూక్కొని, మాకు అన్నం చేసి పెట్టి కూలోళ్లకంటే ఒక అడుగు ముందుగా తోట చేరుకుని, అక్కడ వాళ్లతో సరిసమానంగా నడుము వొంచి పనిచేసి, మళ్లీ పొద్దు మునిగేటప్పటికి రెండు మైళ్లు నడిచొచ్చి, ఇల్లు చేరుకుని, కసువులు నూకి, పాచిగిన్నెలు కడుక్కొని, వంట చేసి పెట్టి, అందరూ తిన్నాక మళ్లీ మునర తట్టలూ, గిన్నెలూ కడిగి బోర్లించి పడుకునేటప్పటికి పదకొండు గంటలు దాటేది. మళ్లీ పొద్దున ఐదు గంటలకే లేచేది" అని గుక్క తిప్పుకోకుండా మా అమ్మ రోజువారీ కార్యక్రమాన్ని వివరించి చెప్పి మా అమ్మ అంత కష్టపడి ఉంటేనే మేము ఈ రోజు నాలుగక్షరాలు నేర్చుకుని అభివృద్ధికి వచ్చిండేది అని ఆమెని ఎంతో గొప్ప చేసి మాట్లాడ్డంలో నాకు సంతోషం ఉండేది.

కానీ, మా అమ్మ చనిపోయిన తరువాత కొన్ని రోజులకు తెల్సిన ఒక విషయం నన్ను దిగ్భ్రాంతుడ్ని చేసింది. నలుగురిలోనూ తలెత్తుకోలేకుండా సిగ్గుపడేట్లు చేసింది.

గత ఆరు ఏడు ఏళ్లలోనే కొన్ని పరిస్థితులు మారిపోయినాయి మా ఇంట్లో.

తోటలో చీనాచెట్లు మంచికాపు కాసి రేండేండ్లపాటు మంచి ధర కూడా పలుకడంతో మా ఆర్థిక పరిస్థితులు మెరుగైనాయి. కొట్టం వేసుకున్న స్థలంలోనే ఒక ఇల్లు కట్టుకున్నాము. మా చెల్లిలి పెళ్లి కట్నకానుకలతో మహావైభవంగా జరిగింది. తరువాత అయిదేళ్లకు మానాయన హఠాత్తుగా చనిపోయాడు.

మా చెల్లెలు నలుగురు బిడ్డల తల్లి అయ్యింది. మా నాయన సంపాదించిన ఆస్తిలో తనక్కూడా భాగం పెట్టమంది. మా అమ్మ ఆశ్చర్యపోయింది.

'నీకు ఇవ్వాల్సినంతా పెళ్లిలోనే ఇచ్చినాము కదమ్మా. ఆస్తిలో కూడా భాగానికి వస్తే నా కొడుకు ఏంతిని బతకాలి? వానికి నీ మొగుని మాదిరి ఉద్యోగం కూడా లేదు' అంది.

'అదంతా నాకు చెప్పొద్దు. ఇది మా నాయన సంపాదించిన ఆస్తి నాకూ నా పిల్లలకూ హక్కుంది!' అంది దృఢంగా.

ఆ మాటకు అగ్గిమీద గుగ్గిలమై మండిపడింది. మా నాయన బతికిన నాళ్లు నేను సంపాదించిన ఆస్తి అంటూ గొప్పగా చెప్పుకునేవాడు. ఆ మాట మా అమ్మను ఎంతో దారుణంగా క్షోభపెట్టేది. తన కూతురు కూడా ఇది మా నాయన సంపాదించిన ఆస్తి అనడంతో ఆమెకు మళ్లీ ఉక్రోషం పుట్టుకొచ్చింది.

"బతుకంతా ఇంత గాడిద కష్టం చేసినా నేను కూడా ఆస్తి సంపాదించానని ఒక్కమాట అనకపోయేకదరా మీ నాయన" అని వెతపడేది మా నాయన బతికి ఉన్న రోజుల్లో.

ఏదైనా పండగకి 'పట్టు చీరకొనుక్కో!' అని మా నాయన డబ్బులు ఇవ్వబోతే, అదే సందుగా తీసుకుని— 'చీరలూ కోకలూ మాకు యాల? నాకు రెండుండాయి, చాలు! నువ్వే కొనుక్కో పట్టుపంచెలూ, పట్టు సెల్లాలూ అన్నీ! నీ దుడ్లు మాకు యాల?' అని సాధించేది.


నేను కొనిచ్చే కోకలూ వద్దు అనే దానివి, నా ఇంట్లో ఉండి నేను పెట్టే కూడుయాల తింటాండావే మల్ల?' అనేవాడు మా నాయన నవ్వుతూ! కానీ ఆ నవ్వు మా అమ్మను నిజంగానే కాల్చేసేది.

'నీ ఇంట్లో పని చేస్తారు. నీ తోట్లో పని చేస్తారు. నీకూ నీ బిడ్డలకూ సాకిరీ చేసి చేసి సస్తాండాము. 'ఇంత గాడిద కష్టం చేస్తే రెండు పూటలు కూడు పెట్టలేరా? నా ఒక్కదానితో ఇద్దరు కూలోళ్లు చేసే పనిని చేయించుకుంటాండారే, నువ్వూ, నీ పిల్లలూ కల్సి! నన్ను ఊరికే కూర్చోబెట్టి బువ్వ పెట్టినట్లు మాట్లాడతారే! నాకు ఏందన్నా రోగమొచ్చి పనికి వంగలేకపోతే యాటికో దూరంగా పొయి తిరపమెత్తుకుని బతుకుతాను గాని, నా ప్రాణం పోయినా మీరు పెట్టే ఋణం కూటికి మాత్రం ఆశించేదాన్ని కాదు' అనేది.

మా చెల్లెలు మళ్లీ అదేమాట అనేటప్పటికి మా అమ్మకు అరికాలి మంట నెత్తికెక్కింది.

'పాపం! మీ నాయనే నమ్మా సంపాదించి ఉండేది భూమిని. మీ నాయన రెక్కలు ముక్కలు చేసుకుని పని చేస్తాంటే నేనేమో పొద్దుకు నాలుగు సార్లు తింటా గొంతు కూర్చుంటాంటి.

మీ నాయన చీనా చెట్లుకింద పాదులు తొగుతాండే. రెండు మిషిన్లు కొట్టే నీళ్లని ఒకటే కాలువకు మల్లేసుకుని పారపట్టుకుని చెట్లకు నీళ్లు కడతాండే సెనిక్కట్టి పీకుతాండే. దినానికి పదిడబ్బాలు



వెనిక్కాయి ఇడి పిస్తాండె. ఎద్దులకూ ఎనుములకూ రెండు మూడు జల్లలు వచ్చిగడ్డి దొక్కోని వస్తాండె. మల్లా సాయంత్రానికి ఇంటికొచ్చి ఎసట్లోకి బియ్యం చేసుకుని మీ అందరికీ వంటలు చేసి పెడతాండె. పాపం మీ నాయనేనమ్మా. కష్టం చేసిచేసి సంపాదిచ్చిండేది! నేనేం కష్టం చేసినాన్నూ, చేతులూ కాళ్లు ఆడేసుకుని వండుకుంటాంటే ఇంట్లో, దొరసాని మాదిరి' అని వ్యంగ్యంతో చురుకు ముట్టుగా మాట్లాడింది మా అమ్మ.

'ఆడపిల్లలు ఆస్తిలో సగభాగం రావల్లని కోర్టులో కొత్తగా చట్టం కూడా చేసినారు' అంది మా చెల్లెలు నవ్వును ముఖంలోకి తెచ్చుకుని.

'ఒకయాల ఆస్తికి మంచి అప్పు మిగిలితే, కొడుకుతో పాటు కూతురూ, అల్లుళ్లూ అప్పులు పంచుకుని మా వంశగౌరవాన్ని నిలబెడతారా? అంది తల్లి.

'ఎందుకు పంచుకోము? ఒక వేళ ఆస్తి లేకపోయినా, అప్పులున్నా పంచుకుంటాము' అంది కూతురు ముసిముసిగా నవ్వుతూ!

'ఊరుకోమ్మా! చాలుగాని! ఆస్తిలో సగభాగం అంట! ఏదో... ఆడపిల్ల పసుపుకుంకానికి పుట్టింటినుంచి కొంతైనా ఆస్తి ఇవ్వాలి అని అడిగితే అర్థముంటుంది. నువ్వు పెండ్లి చేసుకుని వేరే ఇంటికి పొయి అయిదు, ఆరు ఏండ్లు దాటిపోయే కదా! ఈ అయిదు ఆరు ఏండ్లూ మేమంతా కల్సి కష్టం చేసి సంపాదించిన దాంట్లో నీకు ఏం హక్కు ఉంటుంది?' అంది తల్లి.

'నేను హక్కు ఉందని అన్నానా? ఆ పొద్దు మా నాయన నాకు కూడా సగభాగం ఆస్తి రాసివ్వల్ల అని అనుకుని ఉండెకదా! అందుకని అడుగుతున్నాను' అంది మా చెల్లెలు సమయానుకూలంగా ఒక అడుగు వెనక్కి వేసి.

'ఆ పొద్దు మీ నాయన కట్నం ఈయను. కట్నం బదులు ఆస్తి రాసిస్తాను, అంటే మాకు మీ ఆస్తీ గీస్తీ ఏమీ వద్దు కట్నమే కావల్ల అనిరి కదా మీ అత్తింటివాళ్లు. కట్నానికి కట్నము తీసుకుని మళ్లా ఈ పొద్దు వచ్చి ఆస్తికి ఆస్తి కావాలని అడిగితే ఎట్లా?' అంది మా అమ్మ నిష్ఠూరంగా!

'నా పెండ్లి జరిగినప్పుడు భూమి కింద కెనరా బ్యాంక్‌లో అప్పు ఉండెనంట కదా! ఆ అప్పు తీరుతుందో లేదో అని అనుమానంతో కట్నమే కోరుకుండిరంట మా మామావాళ్లు!' అంది మా చెల్లెలు.


'నేను చెప్పేది అదేనమ్మా తల్లీ! ఆడపిల్లలకు తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులు కావాలిగాని వాళ్లు చేసిన అప్పులు కాబట్టవు. అందుకే లోకంలో తల్లిదండ్రులు ఆస్తులు ఇచ్చినా అప్పులు ఇచ్చినా కొడుకులకు ఇస్తారుగాని కూతుర్లకి ఇయ్యరు' అంది లోకం పోకడ చెబుతున్నట్లుగా తల్లి!

'అయితే నాకు ఆస్తి పంచి ఇవ్వరా?' అంది ఆఖరిమాటగా అడుగుతున్నట్లు సహనం కోల్పోయి.

'ఎందుకు పంచిస్తామే, నిన్ను ఆస్తి పాస్తులు లేనివానికీ, బికారోనికీ ఇచ్చి పెండ్లిచేసి, మేము చేతులు దులుపుకుని ఉంటే అది మా తప్పే! కాని మాకు తలకు మించిన బరువంతకట్నమిచ్చి బంగారు పెట్టి ఒక ఉద్యోగస్థునికే ఇచ్చి పెండ్లి చేస్తేమి కదా, నువ్వు సుఖపడల్లని! ఇంక అంతకు మించి ఏ తల్లిదండ్రి అయినా ఏం చేస్తారు, కూతుర్ల కోసం? అంది.

మరొక పదినిమిషాలకు సహనం కోల్పోయి తల్లీకూతుళ్లూ— ఇద్దరు గొంతులు పెంచి వాదించుకున్నారు.

'నీ భర్త ఆస్తిలో సగం ఆస్తి, నీ ఆడపడుచుకు ఇచ్చిరాపో! అప్పుడు వచ్చి అడుగు, నీక్కాడా




సమానంగా పంచిస్తా మీ నాయన ఆస్తిని' అంది.

'నాకు సగం ఇవ్వద్దులే తల్లీ! ఆడపిల్ల పసుపుకుంకుమ కోసం ఏ మాత్రం ఇస్తావో చెప్పు' అంటూ అడిగింది కూతురు మరో మెట్టుదిగి మరో బేరం అడిగే వ్యాపార ధోరణిలో.

'దానికి అప్పుడే ఏంతొందర వచ్చిందిలే' అని తేల్చివేయబోయింది తల్లి.

'ఏమో! ఈ రోజు ఇస్తామని పుట్టిన బుద్ధి రేపటికి ఉంటుందో, ఉండదో! ఆ ఇచ్చేది ఏందో నాకు ఇప్పుడే చెప్పండి' అంది ఖండితంగా.

'... అంటే మా మీద నీకు ఆ మాత్రం నమ్మకం లేదన్నమాట.... హూ..! అంటూ ఏదో కొత్తగా అర్థమైనట్లు హేళనగా దీర్ఘం తీసింది తల్లి.

'అంతేమరి! తల్లి అయితేనేమి? ఎవ్వరైతేనేమి? ఎవరి మీదన్నానరే ఎందుకు నమ్మకం పెట్టుకోవాలి? డబ్బు పాపిష్టిది. ఎప్పుడు ఎవరికి ఏం బుద్ధి పుట్టేస్తుందో చెప్పలేము. ఇన్నాళ్లూ ఆస్తి పంచి ఇస్తారని ఆశపెట్టుకున్నదానికి ఈనాడు ఏం చేస్తిరి మీరు?' అంది కూతురు.

'ఈ దినమే ఇవ్వల్ల ఇప్పుడే ఇవ్వల్ల అని నువ్వు అడిగితే దానికి మేము నీకు బాకీ పడలేదు పో! మా బుద్ధి పుట్టినప్పుడు ఇస్తాము. ఇష్టముంటే తీసుకో, లేకపోతే లేదు' అని విసురుగా జవాబు చెప్పింది తల్లి.

'మా నాయన బతికి ఉంటే నన్ను ఇన్ని మాటలు అనే దానివా? ఇల్లూ భూమి అన్నీ నీ మెడకే కట్టుకుని ఊరేగు. నువ్వూ నీ కొడుకూ సుఖంగా ఉండండి. మేము ఏమైపోతే మీకేమి?' అని వలవలా ఏడుస్తూ వెళ్లి పోయింది కూతురు.

మా అమ్మా చెల్లెలూ ఇద్దరూ వాదించుకుంటున్నంత సేపూ నేను ప్రేక్షకుడిలా చూస్తూ ఊరుకుండి పోయాను. అంటే ఆస్తి పంపకం మీద ఏ అభిప్రాయమూ లేదనికాదు, ఆ కొంచెం భూమి నాకు మాత్రమే చెందితే బాగుంటుందనే ఆశ నాలోకూడా లేకపోలేదు. కాని నోరు తెరిచి అడుగుతున్న చెల్లెలికి లేదుపో అని చెప్పడానికి నా మనసు ఒప్పుకోలేక పోయింది.

ఆస్తి కంటే నా మనసును వెంటాడి పట్టుకున్న అపరాధ భావనను కడిగేసుకోవడమే నాకు ముఖ్యం. అంత మాత్రం చేత మా చెల్లిలికి ఆస్తి ఇవ్వకపోవడానికి మా తల్లి ఏకరువు పెట్టిన కారణాలని అంత తేలిగ్గా కొట్టి పారెయ్యలేను. కానీ మా చెల్లిలికి సగం ఆస్తి పంచి ఇవ్వక పోవడం సబబే అని మా అమ్మ మాటలతో నేను సరిపెట్టుకోలేక పోయినాను.


ఆ మాటే మా అమ్మతో అంటే—'నాకు బతికినంత కాలం ఇంత కూడేసేది నువ్వా లేక నీ చెల్లెలా? వంశాన్ని నిలిపే మగపిల్లవానికి ఇవ్వకుండా పరాయి ఇంటికి ఇచ్చిన ఆడపిల్లకు దారపోస్తామా? ఆస్తిని! నీకేం తెలీదురా వెర్రిబాగులోడా,

నోరు మూసుకో' అంటూ గద్దించింది. నేనుమళ్లీ (పేక్షకుడి పాత్రనే ఆశ్రయించాల్సి వచ్చింది.

మరుసటి సంవత్సరం నా పెళ్లి జరిగితే చుట్ట పు చూపుగా వచ్చి వెళ్లి పోయింది మా చెల్లెలు. కాని, పెళ్లి తరువాత మా అమ్మలో చానామార్పు వచ్చింది. కొత్తగా వచ్చిన కోడలు తన కొడుకును, ఏదో వస్తువులా తన నుంచిలాక్కుని కొంగున గట్టేసుకుని తిరుగుతున్నట్లుగా అనిపించసాగింది ఆమెకు.

తను భర్తతోపాటు కష్టపడి సంపాదించిన ఆస్తిని తన ఇంటికి కోడలుగా వచ్చిన ఒక కొత్త ఆడమనిషి ఏ కష్టమూ పడే అవసరం లేకుండా నిక్షేపంగా అనుభవిస్తూంది కదా' అన్న ఆలోచన ఆమెలో ఏదో కసిని రెచ్చగొట్టింది

మా అమ్మ తన జీవితంలో ఏమీ సుఖపడక పోవడ మే తన కోడలిని (పేమించక పోవడానికి కారణమే మో!




తన కోడలికి, ఆమె పుట్టింటి వాళ్లకి వ్యతిరేకం గా ఇంటా బయటా తనకంటూ ఒక వర్గాన్ని కూడగట్టుకునే (ప్రయత్నంలో భాగంగా మళ్లీ తన కూతురినే దగ్గరకు తీయడం మొదలు పెట్టింది.

అనారోగ్యం వల్ల తోటకు పోవడమూ, అక్క డి పనులను అజమాయిషీ చెయ్యడమూ అనే పె ద్దరికానికి కూడా అవకాశం లేకుండా పోయింది ఆమెకు. ఇప్పుడు తన గాంభీర్యాన్ని, ఆధిక్యతన్నూ పెద్దరికాన్ని (ప్రదర్శించేటందుకు భక్తి తప్ప మ రో మార్గం కన్పించలేదు.

తుమ్మినా, దగ్గినా శివశివా అని అడుగు అడు గుకూ ఉచ్చరిస్తూ, అట్ల ఉచ్చరించినపుడల్లా తన అస్తిత్వం లోంచి ఏదో ఔన్నత్యం విడుదల అవుతున్నట్లు తృప్తి పడేది.

ఆ మధ్య— నలభై రోజులు ఉత్తర దేశయాత్ర లు కూడా చేసి వచ్చింది. కాని ఆమె చనిపోయిన తరువాత రెండు మూడు వారాలకుగాని, నాకు తెలిసిరాలేదు— తను నేపాల్‌లో కొన్న మంచిము త్యాల దండలూ, బొంబాయిలో కొన్న రెండు చీరలూ తన కూతురికి మాత్రమే రహస్యంగా ఇచ్చినసంగతి.

నాతో చెప్పినట్లు కేదార్‌నాథ్ ఆలయం చేర డానికి గుర్రపు సవారీ మీద వెళ్లినందుకు రెండు వందలు ఖర్చు పెట్టడం కూడా అబద్ధమే. ఆ రెం డు వందలతోపాటు మరికొంత డబ్బుకూడా మి గుల్చుకొచ్చి తన కూతురి దోసిట్లో పోసిందని తెల్సింది.

కాని ఆమె చనిపోయిం తర్వాత నన్ను దిగ్భ్రాం తపర్చింది ఆవిషయం కాదు.

మా అమ్మ చనిపోయిన తరువాత కొన్నాళ్లకు మా వీధిలోని వెంకటరావు అనే ఆయన మా ఇం టికి వచ్చి మా అమ్మ తన మనుమరాలికోసం— అంటే తన కూతురి బిడ్డ కోసం అయిదువేల రూపాయల వరకూ నిలువ చేసిపోస్టల్ సేవింగ్స్ బుక్‌ను నా చేతిలో పెట్టి వెళ్లి పోయినాడు.

నన్ను దిగ్భ్రాంతుణ్ణి చేసింది ఆ విషయం కూ డా కాదు.

తోటకు పోయివచ్చి ఒక సాయంత్రం పూట ఇంటి బయట కుర్చీ వేసుకుని కూర్చుని రోడ్లో వచ్చిపోయే జనాన్ని చూస్తుంటే— ఒక ఆడ మని షి వచ్చి ఏడువందలా యాభై రూపాయలు ఎంచి నా ఎదుట అరుగుమీద పెట్టింది నేను ఆశ్చర్యం గా చూస్తుంటే!

ఆమె జిడ్డు ముఖం మీద ఎర్రటి కుంకుమ బొట్టు ఉంది. మెడలో నల్లపూసలు మాత్రం ఉ న్నాయి. 'మీ అమ్మ దగ్గర నా కమ్మలు కుదువబెట్టి శానా నెలలు గడిసిపోయినాయి, అయ్యా! అయి దు రూపాయల వడ్డీ లెక్క వేసుకుంటే నా కమ్మ ల ధర కంటే డెబ్బై అయిదు రూపాయలు ఎక్కు వే అయి ఉంటుంది నా అప్పు. నిరుడు మా అమ్మ సచ్చిపాయె. నిన్న నెలలో మా నాయన సచ్చిపాయె. డెబ్బై అయిదు రూపాయలు పోయినా చింతలేదు. మా అమ్మా నాయనా (పేమతో చేసిచ్చిన ఆ క మ్మలే పెట్టుకోవల్ల అనుకుండాను మీ దుడ్లు మీ రు తీసుకుని నా సొమ్ములు నాకు ఇప్పండి అయ్యా అంది.

అప్పుడు నిజంగా దిగ్భ్రాంతుణ్ణి అయ్యాను. నా తల నేలకు వాలిపోయింది. కమ్మలుకుదువ బెట్టిన ఆ నడివయసు ఆడ మనిషి ముఖం ఎంతో సహజంగా (ప్రసన్నంగా ఉంది. కాని నాముఖమే కత్తి వేటుకు నెత్తురు చుక్క లేకుండా పాలిపోయిం ది.

ఇన్నాళ్లూ ఎంత గొప్పగా భావించుకున్నాను మా అమ్మను! మనుషుల్ని అంతో ఇంతో గొప్పగా ఊహించుకుంటే తప్ప వాళ్లని (పేమించలేమా?

వడ్డీ వ్యాపారం ఎంత అసహ్యం. కన్నకొడుకు కు కూడా తెలియకుండా వడ్డీవ్యాపారం చేసి డబ్బు లు సంపాదించాల్సిన అవసరం ఆయమ్మకు ఏమొ చ్చింది.

కూతురు! అవును, కూతురు మీద (పేమ! కూతురికి ఆస్తి పంచి ఇవ్వడానికి ఆమె మనసు ఒప్పుకోదు, కానీ చాటుమాటుగా అంతో ఇంతో డబ్బును వెనకేసుకుని కూతురికి ఇచ్చుకోవడం ద్వారా తన కన్నతల్లి (పేమను వ్యక్తీకరించుకునే (ప్రయత్నం చేసింది.

ఆస్తి పంచివ్వనని చెప్పిం తర్వాత ఆరు నెలలు కూతురు తల్లితో మాట్లాడలేదు. అటువంటి కూతురితో తన మాతృసంబంధాన్ని పునరుద్ధరి మకోవాలంటే, అందుకు కావాల్సిన తన సహజ మైన కన్న(పేమ కాదు, డబ్బు...! అన్న విషయం ఆమెకు బాగా తెలుసు.

'ఆ కమ్మలు నా దగ్గర లేవు. నా పక్కింటి వాళ్లకు అమ్మేసినాను. ఇన్నిదినాల తరువాత వచ్చి అడిగితే ఎట్లా? ఆ పొద్దే దుడ్లు కడితే ఇవ్వనన్నామా? గడువు అయిపోయినంక దుడ్లు తెచ్చి నా కమ్మ లు నాకు ఇమ్మని అడిగితే ఎక్కడి నుంచి తెచ్చిస్తా ము?' అంది చెల్లెలు. ఆమె అనాగరికురాలు కానేకా దు. ఇంటర్ వరకూ చదువుకున్నదే! తనతల్లి చేసి న వడ్డీ వ్యాపారం తప్పు అని ఆమె మనసుకు తట్టక పోవడం నిజంగా ఆశ్చర్యమే. లేక తప్పు తెల్సినా డబ్బుతో కళ్లు బైర్లు కమ్మి తప్పొప్పుల్ని పట్టించు కోరేమో!

''ఈ కొట్టాలవాళ్లు— నూరు రూపాయలే అంటారు కొందరు, అసలు మీ అమ్మ దగ్గర మేము అప్పే చెయ్యలేదుపో! అంటూ ఎగేస్తారు. ఈ కొట్టాల వాళ్లని నమ్మగూడదు, నా...'' అం ది.

ఆరు ఏడు ఏళ్లకిందట మేము కొట్టాంలో కాక మేడల్లో ఉన్నామా? ఆ విషయం అప్పుడే మర్చి పోయింది మా చెల్లెలు.

'నూటికి అయిదు రూపాయలు వడ్డీ గుంజే వాళ్ల దగ్గర నీతిగా ఉండాల్సిన అవసరం ఏమొచ్చిందిలే అని అనుకుని ఉంటారు. వాళ్ల న్యాయసూత్రాలు వాళ్లవి' అన్నాను. నన్ను ఒక వెర్రిబాగులవాని మాదిరి చూసి వెళ్లి పోయింది.

ఇంటింటికి తిరిగి, రోడ్డు మీద నిలవేసి మా అమ్మ ఇచ్చిన అప్పుల్ని వడ్డీతో సహా వసూలు చెయ్యడం మాత్రం మానలేదు మా చెల్లెలు. ఆ వసూలు చేసిన డబ్బంతా తనకు పుట్టింటి నుంచి రావాల్సిన పసుపుకుంకుమ ఖర్చు కింద జమకట్టుకుంది ఆ సంప్రదాయపు ఆడపడుచు.

నేను మా చెల్లెలుకు బట్టలు పెట్టడానికి, ఇంకా ఏమైనా అడిగితే తక్షణమే తీసివ్వడానికి సిద్ధమే అన్న విషయం మా అమ్మకు తెలుసు. కానీ తన కొడుకునూ కోడలునూ లోభిమనుషులుగా చిత్రిస్తేతప్ప తన స్వంత సంపాదన అయిన ఆ డబ్బుకు కూతురి దృష్టిలో విలువ పెరగదని ఆమె భావించి ఉంటుంది. లేకపోతే మా చెల్లెలు ఆ అయిదు, వేలకూ పదివేలకూ సంతోషపడి పొయ్యేరకం కాదని మా అమ్మకు తెల్సు.

ఆమె నిజంగా ప్రేమించేది కూతురునీ కాదు, కొడుకునీ కాదు, స్వంత సంపాదనని! ఆ సంపాదనకు విలువ తన కూతురి దగ్గర దొరకుతుందిగాని, వడ్డీ వ్యాపారాల్ని అసహ్యించుకునే తన కొడుకు దగ్గర దొరుకదని కూడా ఆమెకు బాగా తెల్సు. ఆమెకు కావాల్సింది— తన స్వంత సంపాదనను గౌరవించేవాళ్లూ, ఆ డబ్బుకోసం ఆశపడే వాళ్లూ! అందుకే వడ్డీ వ్యాపారం మొదలు పెట్టినప్పటి నుంచి నాకంటే మా చెల్లెలితోనే ఆమెకు అనుబంధం ఎక్కువైంది.

'ఇది నేను సంపాదించిన ఆస్తి' అని మా నాయన గర్వంగా ఏ ముహూర్తాన చెప్పుకున్నాడో—గాని ఆదేక్షణం స్వయం సంపాదన కోసం బీజం ఏర్పడి ఉంటుంది. మా అమ్మ మనసులో!

మా అమ్మ చనిపోయినప్పుడు నా భార్య ఆరు నెలల గర్భిణి. ప్రసవించిన అయిదవ నెలలో ఒడిబియ్యం కట్టుకుని పేరు పెట్టుకున్నాను. ఏవేవో ఔన్నత్యాల్ని ఊహించుకునే కాల్పనిక ప్రేమకన్నా మనిషిని లోపాల్తో సహా ప్రేమించగలిగే సరళ స్వభావమే నిజంగా గొప్పది అనిపించింది— ఒక స్నేహితుడు ఏదో మాటల సందర్భంలో అన్నట్టు.

నా చిన్నప్పుడు— అయ్యవారు పాఠం చెబుతూ జిజియా బాయి శివాజికి ఎన్నో వీరుల కథలు చెప్పి అతన్ని ఒక వీరునిగా తయారు చేసింది అని చెప్పినప్పుడూ, పెద్దయ్యాక కూడా— ఒక కాలెండర్‌లో శకుంతల తన కొడుకు భరతునికి బాణం అందిస్తూ విలువిద్య నేర్పుతున్న బొమ్మను చూసినప్పుడు కూడా ఎంతో భావోద్వేగానికిలోనైనా, మొరటుతల్లి స్థానంలో వాళ్లని నా వీరమాతలుగా ఊహించుకుని కాల్పనిక జగత్తులో తేలిపోయేవాడ్ని.

నన్ను పరామర్శించి పోదామని ఆరోజే... అంటే నా భార్య ఒడి బియ్యం కట్టుకుని వచ్చిన రోజే కాకతాళీయంగా వచ్చినారు మా పిన్నమ్మలు ఇద్దరూ— అంటే మా అమ్మ చెల్లెళ్లు ఇద్దరూ!


అన్నం తినేదానికి కూర్చుంటూ 'కోడలు కట్టుకొచ్చిన ఒడి బియ్యం తినేదానికి మా అక్కయ్యకు ప్రాప్తం లేకపాయె' అంటూ ఇద్దరు చెల్లెళ్లూ కొంచెం సేపు ఒకర్ని పట్టుకుని మరొకరు ఏడ్చినారు.

మా అమ్మ తినకపోతే పోనీలే పిన్నమ్మా తన బదులు ఇద్దరు అమ్మల్ని పంపించింది కదా, నాకోడలు కట్టుకొచ్చిన ఒడి బియ్యం తిని రాపోండి అని అన్నాను నవ్వును ముఖం మీదికి తెచ్చుకుంటూ

అంతా అన్నంతిని ఆకూ వక్కా వేసుకుని నములుతూ కూర్చున్నప్పుడు—'కుళాయి గుంతలో పడి అవ్వకు కాలువిరిగింది కదా పిన్నమ్మా! చూసే దానికి పోయి ఉంటివా?' అని అడిగినాను. ఆ తల్లీ కూతుళ్లకు మధ్య మాటలులేక ఒకటి కాదు రెండు సంవత్సరాలు కాదు, పది సంవత్సరాలు అయ్యింది అందుకని అడిగాను.

ఒకసారి మడికయ్యల్లో నాటేదానికి వరినారు తక్కువ పడితే, మా అవ్వని అడిగిందంట మా పిన్నమ్మ 'వరినారు పీక్కపోతాను' అని 'మాకు సరిపోయి ఇంకా మిగులుతుందిలే. పీక్కపో' అనిందట మా అవ్వగూడా. తరవాత కొన్నాళ్లకి 'మా కయ్యల్లోంచి వరినారు పీక్కపోతివి కదా! మరి దుడ్లు ఈయలేదే!' అని అడిగిందట మా అవ్వ. అంతే వరినారు ఖరీదు దుడ్లని ఇసిరి ముఖానికికొట్టి 'థూ ఇంక నీతో మాట్లాడితే నన్ను చెప్పు తీసుకుని కొట్టు' అని వెళ్లిపోయిందట. అంతే! అప్పటినుంచి ఆ తల్లీ కూతుళ్లకి మాటలులేవు.

'నేనా! దాని ఇంటి గడపైనా తొక్కుతానా!'




అంది గుడ్లు కొంచెం పెద్దవి చేసి రోషంగా మా సుబ్బమ్మ పిన్నమ్మ!

'కొట్లాడుకున్నా, తిట్లాడుకున్నా రక్తసంబంధం తప్పుతుందా! ఎట్లాంటిది అయినా అమ్మ అమ్మే కదా! ఎన్ని జన్మలెత్తినా మనం తల్లి రుణం తీర్చుకోగలమా పిన్నమ్మా' అన్నాను.

వాస్తవంలోకి పూర్తిగా ఇంకిపోలేని కాల్పనిక ప్రేమోద్వేగం నాలో ఇంకా ఏమూలో పని చేస్తూ పలికించిన మాటలు అవి!

'ఆ మాటకువస్తే మేము మా తల్లికి రుణపడలేదు. మా తల్లే మాకు రుణ పడి ఉంది' అంది మా సుబ్బమ్మ పిన్నమ్మ.

'ఎట్లా? అని అడిగేవు' అంటూ నా ప్రశ్నను కూడా తనే వేసుకుని జవాబు వివరించింది. నా పెండ్లి చేసినారు. అంటే... నా పదేండ్ల కూలి దుడ్లు నా పుట్టింట్లోనే ఉండిపోయె కదా! నేనే కాదు, మా ముగ్గురు చెల్లెళ్లూ కూలి చేసి సంపాదించిన దుడ్లన్నీ ఎనకేసుకుని ఇన్ని జీతాలూ, ఇంత భూమి సెక్కా కొనుక్కొని ఈ పొద్దుకి మంచి సావుకార్లుగా అభివృద్ధి అయ్యింది.

'ఇప్పుడు సెప్పుమల్ల. నేను మాయమ్మకు రుణపడినానా? లేక మాఅమ్మే నాకు రుణపడిందా? నేను ప దేండ్లు కూలి చేసి ఇచ్చిన దుడ్లని లెక్కగడితే ఇప్పటి విలువలో ఎన్ని రూపాయలు అవుతాయి? ఆ కూలిదుడ్లుమీద ఒక రూపాయి ధర్మ వడ్డీ ఏసి చూడు. అన్ని దుడ్లు మాయమ్మ నాకు బాకీపడినట్టేకదా!' అంటూ నిలదీసి అడిగింది. నేను జవాబుచెప్పలేక ముఖానికి నవ్వును పూనుకుంటూ ఉంటే 'తల్లి రుణం అంట తల్లి రుణం!' అంటూ హేళనగా గొణుక్కుంది తన లోతాన్ను.

'మేము పుట్టింట్లో పడిన కష్టానికి విలువ లేదూ మొగుని ఇంట్లో పడిన కష్టానికి విలువలేదు మా ఆడోల్లు మొగోళ్లతో సరిసమానంగా కాయకష్టం చేసినా ఆస్తిని సంపాదించినారని మొగోల్లని పొగు

డుతారుగాని మమ్మల్ని ఎవరూ ఆనుగోరు కదా! ఎప్పుడన్న సీరమీదో రవికబట్టమీదో బ్రమపడి, కొనిమ్మని నోరుతెరచి అడిగితే, చెట్లకు కాసినా యనుకుండావా దుడ్లు? అని అంటారు. పావలాను రూపాయో కరుసు పెట్టినామని తెలిస్తే యాడివే లంజా, నీకు దుడ్లు? అని నిలదీసి అడుగుతారు. మాకు పుట్టిన పిల్లలుకూడా మా తండ్రి ఆస్తి అనే అంటారు గాని మా తల్లితండ్రుల ఆస్తి అనరుకదా!" అంది మా సంజమ్మ పిన్నమ్మ నవ్వుతూ.

మా అమ్మ తనకంటూ ఒక స్వయం సంపాదన ఉండాలని ఆశపడ్డంలో తప్పులేదు. ఆమెకు చిన్నప్పటి నుండీ తెల్సిన ఒకే ఒక సంపాదనా మార్గం కాయకష్టమే! కాని స్వయం సంపాదన గురించిన ఆలోచన ఆచరణలో పెట్టబోయేనాటికి ఆమె రెక్కల్లోని సారమంతా మా కుటుంబం కోసం ఖర్చు అయిపోయింది. దానితో తనకు చిన్నప్పటి నుండి తెల్సిన ఆ ఒక్కగానొక్క సంపాదనా మార్గానికి తలుపులు మూసుకుపోయి, చివరికి వడ్డీ వ్యాపారాన్ని ఆశ్రయించి ఉంటుంది.

సాయంత్రం కాఫీ తాగి వాళ్ల ఇండ్లకు పోయేటప్పుడు మా సుబ్బమ్మ పిన్నమ్మ నా దగ్గరికొచ్చి 'ఆస్తిలో చెల్లెలికి భాగం పంచి ఇస్తానన్నావంట కదరా! నీకెమన్నా తిక్క పట్టిందా?' అని ఎంతో మమకారంతో గుసగుసగా దండించి పోయింది.

'మాది ఆడజన్మ నాయనా! అని ఈ ఆడవాళ్లెన్ని ధీర్ఘాలు తీసినా తమకు కొడుకుల మీద గల ప్రత్యేక ప్రేమను మాత్రం కాపాడుకుంటూనే ఉంటారు అనిపించింది.

మనుషుల మధ్య సంబంధాల్ని శాసించి నడిపించగల సూత్రాలు డబ్బు చేతిలోనే ఉంటాయేమో, ప్రధానంగా, డబ్బు నేపథ్యంలో మనుష్యులంతా నీడల తొడుగులే! వాళ్ల మధ్య సంబంధాలన్నీ నీడల ముడులే. ●

# అయోధ్యలో కౌసల్య ప్రసవించిన మందిరం ఎక్కడ?

క్రీస్తుశకం 1526లో మధ్యఆసియా జాతివాడైన బాబరు— తన భారతదేశ దండయాత్ర సందర్భంలో— క్రీస్తుకు 100 సంవత్సరాల పూర్వం అయోధ్యలో విక్రమాదిత్యుడు కట్టించిన రామాలయాన్ని ధ్వంసం చేసి ఆ శిథిలాలపై మశీదు కట్టించాడు. ఇది చారిత్రక సంఘటన. దేశ చరిత్రలో మొగలాయి పాలన ముఖ్యఘట్టం. ఆ వంశస్థాపకుడు కూడా ఇతడే. చరిత్ర పుటల్లో ఎన్నో అమానుష ఘటనలు మూలుగుతూ వుంటాయి. అలాని నాటి అన్ని వ్యవహారాలను ఇపుడు సరిచేయడం అవసరమా! సోమనాథ ఆలయదుస్థితి అయోధ్యలో రామాలయం స్థితి ఒకటా! ఆనాడు దోపిడీదారులు, పరమతద్వేషులు చేసిన పనినే నేటి ఇంతటి పరిపక్వత దశలో చేయసంకల్పం సబబా! ఎవరు విదేశీయులు? ఎప్పటివరకూ ఆ ముద్ర వారిపై వుంటుంది? యూరపు అమెరికా ఖండాల దేశాలలోని నేటి మెజారిటీ ప్రజల వంశాంకురర నమ్మకం విదేశీయం కాదా! రాముడు ఎవరు? విక్రమాదిత్యుడు ఎవరు? ఆర్యులు కారా? ఆర్యులు కూడా ఒకప్పుడు విదేశీయులు కారా? భారత దేశానికి జాతీయత ఎప్పటి నుండి? అయోధ్య నగరంలో రాముడు జన్మించిన ప్రదేశం ఎక్కడ? దీనికి సహేతుకంగా రుజువులుండవు! భారతీయులకు కేవలం ఆదర్శంగా మిగిలిన శ్రీరామచంద్రుని ఆలయ నిర్మాణానికి అయోధ్యలో మరెక్కడా చోటు లేదా? గాంధీపుట్టిన దేశం భారతదేశం! బుద్ధుడు పుట్టిన దేశం భారతదేశం! అలాంటపుడు రాముని జన్మభూమిగా అయోధ్యనే పరిమితం చేస్తారా మాన్యులు? మనది పేరుకి మాత్రమే సెక్యులర్ రాజ్యం. కాని పరోక్షంగా మత విశ్వాసాలను పెంచి పోషిస్తుంది ప్రభుత్వం (టీ.వి. లో రామాయణ మహాభారతాలు నెలల కొలది ప్రసారంచేసి కుంభమేళా వగైరాల ప్రాముఖ్యత ఇవ్వడం). ఇటువంటి పాలకులున్నంత వరకు మత విశ్వాసాలకు చెందిన జటిల సమస్యలు సృష్టించబడుతూనే వుంటాయి. ఎప్పుడో 463 ఏండ్ల క్రితం జరిగిన సంఘటనలకు నేడు ప్రతిస్పందిస్తున్న ఈ మతాభిమానులు 43 సంవత్సరాల క్రితం దేశవిభజన సందర్భంలో జరిగిన దారుణ మారణహోమాన్ని చిత్రంగా మలచి టీ.విలో ప్రసారం చేస్తే (తమస్) పెద్దపెట్టున అభ్యంతరాలు తెలిపారు.

రెండువేల సంవత్సరాలకు పూర్వం యూదుజాతీయులు తమ మాతృభూమి పాలస్తీనా నుండి తరిమివేయబడి, ప్రపంచం నలుమూలలా చేరుకుని, ఏ దేశంలోనైనా పరాయి వాళ్ళుగానే పరిగణింపబడి, 20 తరాల అనంతరం భూమిపై తమ మనుగడ కోసం తమ హనీలాండును స్వాధీనపరచుకొని ఇజ్రాయిల్ దేశాన్ని పునఃస్థాపించుకున్నారు. మనుగడ కోసం పోరాటమైనా అమాయకులైన లక్షలాది పాలస్తీనా అరబ్బులకు నీడ లేకుండా చేసిందా పోరాటం. గత 40 ఏళ్ళబట్టీ పశ్చిమాసియా మరుభూమిగా మారింది. అయోధ్య సమస్య వునికి కోసం కానేరదు. కాని దేశదేశాల్లో మతపోరాటాల మంటలు రగల్చడం విజ్ఞులకు తగదు. భారతదేశంలో హిందువులు రెండవ తరగతి పౌరులుగా చూడబడుతున్నారనేది అర్థరహితం.





దేశసౌభాగ్యం కోసం మౌలిక మార్పులు తీసుకుని రాలేకపోగా వాటిని దాటేసే అవినీతి పాలకులను గద్దె దించే తరుణంలో ప్రజల దృష్టి మళ్ళించడం వచ్చి మోసం. ఈ రామజన్మభూమి సమస్య చివరకు ఓ ఎత్తుగడలా తేలినా ఆశ్చర్యపడనవసరం లేదు.

—ఎ.నాగరాజు,
రావ్ఎనగర్.

ఈ లేఖ మా 5.9.89 సంచిక సంపాదకీయంపై ఖండనగా వెలువడినది ప్రకటిస్తున్నాము. రామజన్మభూమి, సెక్యులర్ ముసుగులో, హిందువులకు జరుగుతున్న అన్యాయాలపై చర్చకు ఆహ్వానిస్తున్నాము. విజ్ఞులైన పాఠకులు యీ చర్చలో పాల్గొనవలసిందిగా ఆహ్వానిస్తున్నాము.

—అడ్వయిజరీ ఎడిటర్